క్లుప్తంగా

'అగ్నివీర్'కు ఎంపిక

కామారెడ్డి అర్బన్/కామారెడ్డి టౌన్: భారత సైన్యంలో చేరడానికి కొత్తగా తీసుకొచ్చిన 'అగ్నివీర్'కు కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డికి చెందిన ఇద్దరు, రాజంపేటకు చెందిన ఒకరు ఎంపికయ్యారు. చిన్నమల్లారెడ్డికి చెందిన గంగుల నరేష్, లక్కబత్తిని శివకుమార్, రాజంపేటకు చెందిన నితీష్‌లు ఎంపికయ్యారు. కాగా వీరందరు చిన్నమల్లారెడ్డి ఉన్నత పాఠశాల విద్యార్థులు కావడంతో గ్రామస్తులు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు.

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలానికి చెందిన పలువురు యువకులు ఉత్తమ ప్రతిభ కనబర్చి అగ్నివీర్‌కు ఎంపికయ్యారు. జలాల్‌పూర్ గ్రామంలో ఒకే ఇంటికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు మత్తమాల నవీన్, మత్తమాల దుర్గయ్య, కన్నారెడ్డి గ్రామానికి చెందిన పె ర్కంటి నందురాజు, మెల్లకుంటతండాకు చెందిన కొర్ర నరేష్ ఆర్మీ ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి



నిజాంసాగర్(జుక్కల్): తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ టీచర్లు ఆదివారం జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధేకు వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సురేశ్‌గౌండ, వజ్ర, రోజ తదితరులు ఉన్నారు.

ఆలయ భూమిపై వివాదాలు వద్దు



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి మండలం ఉగ్రవాయి గ్రామంలో శివాలయానికి సంబంధించిన భూమి విషయంలో వివాదాలు తీసుకురావద్దని గ్రామస్తులు పేర్కొన్నారు. భూ వివాదంపై మాట్లాడుకుందామని చెప్పి భయభ్రాంతులకు గురిచేయడం సమంజసం కాదని ఆదివారం గ్రామస్తులు స్పష్టం చేశారు. గతంలో వివాదం ఏర్పడినప్పుడు మాట్లాడుకుందామని చెప్పి ప్రస్తుతం న్యాయపరమైన వివాదాలు తీసుకువస్తున్నారని, వీటికి భయపడేది లేదని గ్రామస్తులు అన్నారు.

మిషన్ భగీరథ పనుల పరిశీలన

బాన్సువాడ టౌన్: పట్టణంలోని బీడీ వర్కర్స్ కాలనీలో నూతనంగా వేస్తున్న మిషన్ భగీరథ పైపులైన్ పనులను ఆదివారం మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో బీడీ వర్కర్స్ కాలనీలో మిషన్ భగీరథ పైపులైను వేస్తున్నామని అన్నారు. సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీల పనులు పూర్తి చేశామని అన్నారు. కమిషనర్ రమేష్, కౌన్సిలర్ అంబర్‌సింగ్ ఉన్నారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



రామారెడ్డి(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్‌పై జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని మండల రైతు కమిటీ అధ్యక్షుడు నారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రామారెడ్డి మండలానికి ఏం చేశాడో జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి ప్రజలకు చెప్పాలన్నారు. అసత్య ఆరోపణలు చేస్తే తీవ్ర పరిణామాలుంటాయని వారు హెచ్చరించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

పిట్లం(జుక్కల్): మండలంలోని తిమ్మానగర్‌లో ఆదివారం పలు బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ మండల నాయకులు విజయ్ అందజేశారు. అల్లాపూర్ గ్రామ రైతుబంధు అధ్యక్షుడు అంబారెడ్డి, నాయకులు తదితరలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



బీబీపేట: మండలంలోని యాడారం గ్రామంలో సీసీ రోడ్డు పనులను ఆదివారం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకట్‌రావు, రైబస అధ్యక్షుడు నాగరాజ్‌గౌడ్, ఎంపీటీసీ లక్కర్సు రవి, బాపురెడ్డి, వెంకటేశం, స్వామి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ బడులు ఆహ్వానిస్తున్నాయి

- మోడల్ స్కూల్స్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం
- 6నుంచి 10తరగతుల్లో విద్యార్థులకు అవకాశం
- దరఖాస్తుకు చివరి తేది ఫిబ్రవరి 15



కొత్తాబాదిలోని మోడల్ స్కూల్

బాన్సువాడ రూరల్: ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు ప్రకటన వెలువడింది. గ్రామీణ ప్రాంతంలో ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థులకు ఆంగ్లమాధ్యమంలో విద్యకు ఈ పాఠశాలలు దోహదపడనున్నాయి. ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల్లో వేల రూపాయల ఫీజులు చెల్లించలేని పేద కుటుంబాల విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో ఉచిత విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం 2013లో ఆదర్శ పాఠశాలలను నెలకొల్పింది. ఈ బడుల్లో 6వ తరగతి నుంచి 10తరగతుల్లో ప్రవేశాలకు అవకాశం ఉంది.

సీట్ల కేటాయింపు ఇలా...

ప్రస్తుతం కామారెడ్డి జిల్లాలో 6 మోడల్ పాఠశాలలు ఉన్నాయి. జిల్లాలోని బాన్సువాడ (కొత్తాబాది), సదాశివనగర్, నాగిరెడ్డిపేట్, ఎల్లారెడ్డి, నిజాంసాగర్, మద్నూర్(మేనూర్)లలో గల 6పాఠశాలల్లో 6వ తరగతిలో 600 వందల మంది విద్యార్థులకు ప్రవేశం ఉంటుంది. దీంతో పాటు 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఎస్సీ విద్యార్థులకు 15శాతం, ఎస్టీలకు 6శాతం, బీసీ విద్యార్థులకు 29శాతం ఉంటాయి. బీసీ విభాగంలో బీసీ ఏ–7, బీసీ బీ–10, బీసీ సీ–1, బీసీ డీ–7, బీసీ ఈ–4తో పాటు ఓపెన్ కేటగిరిలో 50శాతం సీట్లను భర్తీ చేస్తారు. అన్ని కేటగిరిల్లోనూ బాలికలకు 33శాతం, దివ్యాంగులకు 3శాతం సీట్లు కేటాయించనున్నారు.

దరఖాస్తు ఇలా...

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకునేందుకు వెబ్‌సైట్ http/telanganams.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకు విద్యార్థి పాస్‌పోర్టుసైజ్ ఫోటో, ఆధార్‌కార్డు, బోనాఫైడ్‌తో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న కాపీతో పాటు కుల ధృవీకరణపత్రం, ఆధార్‌కార్డు, బోనాఫైడ్ జీరాక్సు పత్రాలు ఏ పాఠశాలలో ప్రవేశం నమోదు చేసుకున్నామో ఆ పాఠశాల ప్రిన్సిపల్‌కు అందజేయాలి. దరఖాస్తులు ఫిబ్రవరి 15లోగా చేసుకోవాలి. పరీక్ష ఫీజు జనరల్ కేటగిరి విద్యార్థులకు రూ.200, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగులు, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రూ.125 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. హాల్‌టికెట్లు ఏప్రిల్ 8నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. 16న పరీక్ష ఉంటుంది

ప్రవేశ పరీక్షా విధానం..

ప్రవేశ పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. అన్ని మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తా రు. మొత్తం 100ప్రశ్నలు అడుగుతారు. ఒక్కోప్రశ్న కు ఒక మార్కు ఉంటుంది. 6వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో 5వ తరగతి సిలబస్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. తెలుగు, గణితం, సైన్స్, సోషల్, ఇంగ్లీష్ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

మోడల్‌స్కూల్ ప్రత్యేకతలు..

- 6నుంచి 10 తరగతి వరకు ఉచిత బోధన, పుస్తకాలు, యూనిఫాంలు
- పక్కా భవనంతో కూడిన విశాలమైన తరగతి గదులు, సైన్స్, కంప్యూటర్ ల్యాబ్, ప్రొజెక్టర్ రూంతో పాటు లైబ్రరీ సదుపాయం
- నాణ్యమైన మధ్యాహ్న భోజనం, పౌష్టికాహారం అందజేత
- పోటీ పరీక్షల విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యం

స్థానిక విద్యార్థులకు ప్రాధాన్యత



ఆదర్శ పాఠశాలల్లో సీట్ల భర్తీలో స్థానిక విద్యార్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. 6వ తరగతిలో పూర్తిసీట్లు, 7నుంచి 10వ తరగతి వరకు పరిమిత సంఖ్యలో మిగులు సీట్లకు ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. ఆసక్తి, అర్హత కల్గిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థుల ఎంపిక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా కొనసాగుతుంది.

– ఫకీరయ్య, ప్రిన్సిపల్, కొత్తాబాది టీఎంఎస్

గ్రామాల్లో పారిశుధ్య పనులు



సర్వలో మురికి కాలువలను శుభ్రం చేస్తున్న కూలీలు

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని సర్వ గ్రామ పంచాయతీలో ఆదివారం కూలీలు సంపూర్ణ పారిశుధ్య పనులు చేపట్టారు. ఈసందర్భంగా పలు వార్డుల్లోని మురికి కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని, మురికిని తొలగించారు. పనులను సర్పంచ్ గొర్గంటి సంగమణి పరిశీలించారు. కారోబార్ ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

పెద్దకొడప్‌గల్ మండలంలో..

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలోని పలు కాలనీల్లో గల మురికికాలువల్లో పేరుకుపోయిన చెత్తను ఆదివారం గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగించారు. పనులను సర్పంచ్ తిర్మల్ రెడ్డి పరిశీలించారు. జీపీ సిబ్బంది ఎల్లయ్య, భూమయ్య, శాంతవ్వ తదితరులు ఉన్నారు.

'మన్‌కీ బాత్'ను వీక్షించిన బీజేపీ నాయకులు



ఎల్లారెడ్డిలో మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

ఎల్లారెడ్డి: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నిర్వహిస్తున్న మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం బీజేపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వీక్షించారు. నాయకులు ఎస్ఎస్‌రెడ్డి, దేవేందర్, బాలకిషన్, సతీష్, రాములు తదితరులు ఉన్నారు.

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం టీవీలో ప్రసారమైన మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు, కార్యకర్తలు వీక్షించారు. నాయకులు హన్మాండ్లు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్యాయాన్నే ప్రశ్నిస్తున్నాం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): కొన్ని రోజులుగా బాన్సువాడ నియోజకవర్గంలో దళిత సోదరీమణిపై జరిగిన అన్యాయాన్ని బీజేపీ తరపున ప్రశ్నిస్తున్నామని, ఆమెకు న్యాయం జరిగేలా పోరాటం చేస్తున్నామని మండల బీజేపీ అధ్యక్షుడు హన్మండ్లు యాదవ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత సోదరులారా ఆలోచించండి.. ఆమెపై జరిగిన అన్యాయాన్ని నిలదీయాలే కానీ, ఒక వ్యక్తి కోసం వెనుక నిలబడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. తప్పు జరిగితే నైతిక బాధ్యత వహించాల్సిన సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్‌ను ప్రశ్నిస్తున్నాం అన్నారు. ఈ విషయంలో దళితులు మేల్కోవాలన్నారు. నాయకులు గంగాధర్ గుప్తా, కార్యకర్తలు ఉన్నారు.

చిట్యాలలో పశువైద్య శిబిరం



చిట్యాలలో పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది



అడ్లూర్ గ్రామంలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి)/కామారెడ్డి అర్బన్: తాడ్వాయి మండలంలోని చిట్యాల గ్రామంలో ఆదివారం జాతీయ సేవాపథకం కార్యక్రమంలో భాగంగా కోరుట్ల పశువైద్య విద్యాలయం ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. అలాగే కామారెడ్డి పరిధిలోని అడ్లూర్ గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వారు పశు, జంతు సంరక్షణపై అవగాహన కల్పించారు. పశువులకు వ్యాధి నివారణ మందులను వేశారు. సర్పంచ్ కవిత, డెయిరీ డిప్యూటి డైరెక్టర్ ప్రవీన్‌కుమార్, కామారెడ్డి ఏడీ సంజయ్, పాలకేంద్రం అధ్యక్షుడు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

లింగంపేటలో కంటి వైద్య శిబిరం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని జీఎస్ఆర్ గార్డెన్‌లో ఆదివారం మదన్‌మోహన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరం ఉన్న వారికి కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. శిబిరం ఏర్పాటు చేసిన మదన్‌మోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



లింగంపేటలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

గంజు వ్యవస్థాపక వ్యాపారి మృతి



అతిమాముల రాములు (ఫైల్)

భిక్కనూరు: మండల కేంద్రానికి చెందిన గంజు వ్యాపారి అతిమాముల రాములు (83) ఆదివారం మృతి చెందాడు. పలువురు వ్యాపారులు, రాజకీయ నాయకులు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళ్లు అర్పించారు. అంత్యక్రియలు మండల కేంద్రంలో సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు కుటుంబీకులు తెలిపారు. 1971లో భిక్కనూరులో వ్యవసాయ మార్కెట్ (గంజు) ప్రారంభ వ్యవస్థాపకుల్లో రాములు ముఖ్యుడు.



మద్నూర్(జుక్కల్): ఆకలితో ఉన్న కొంగలు, ఆహారం కోసం వేట ప్రారంభించాయి. పొట్ట నింపుకునేందుకు పొలం బాట పట్టాయి. మద్నూర్ మండలంలోని సుల్తాన్‌పేట్ గ్రామ శివారులో ఆదివారం పొలంలో వందల సంఖ్యలో కొంగలు చేరి పురుగులను తిని కడుపునింపుకున్నాయి.

సమాచారం..

■ దరఖాస్తుల ఆహ్వానం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపులే బీసీ గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న పీఈటీ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జ్యోతీర్మయి ఒక ప్రకటనలో తెలిపారు. బీపెడ్ విద్యార్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 7993456633ను సంప్రదించాలని సూచించారు.

■ ఫిబ్రవరి 5న 'నీళ్లు' పుస్తకావిష్కరణ

కామారెడ్డి అర్బన్: పాతరాజంపేట శివారులోని ఆర్ష గురుకులం మీమాంసక్ బ్రహ్మానంద సరస్వతీ ఫిబ్రవరి 5న ఆదివారం 'నీళ్లు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని పుస్తక రచయిత బైస హరిదాస్ ఆర్య ఒక ప్రకటనలో తెలిపారు. సాహితీప్రియులు ఆదివారం ఉదయం పదిగంటలకు గురుకులంలో నిర్వహించే కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన కోరారు.

■ నేడు డ్వాక్రా సంఘాల నిరసన ర్యాలీ

రాజంపేట: మండల బీజేపీ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళ సంఘాల పావల వడ్డీ కోసం నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు గంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడలి నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు మహిళా సంఘ సభ్యులతో ర్యాలీ నిర్వహించి, ఎంపీడీవోకు వినతిపత్రం అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

■ నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డి: పట్టణంలోని వంగపల్లి కల్యాణ మండపంలో సోమవారం కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను ఎమ్మెల్యే జాజాల సురేందర్ పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు ఉదయం పది గంటలకు కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన కోరారు.

■ నేడు బాన్సువాడలో దళితుల ధర్నా

బాన్సువాడ టౌన్: బాన్సువాడ ఆస్పత్రిలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ ప్రసాద్‌పై బీజేపీ నేత చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం బాన్సువాడలో ధర్నా చేపట్టనున్నట్లు దళిత ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. పట్టణంలో ఆదివారం దళిత సంఘాల ఆధ్వర్యంలో ఐక్య కార్యాచరణ కమిటీ సమావేశం నిర్వహించారు. బాన్సువాడ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్‌ను బ్రోకర్ అంటూ బీజేపీ నేత మాల్యాద్రిరెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. మాల్యాద్రిరెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పే వరకు ఆందోళనలు చేస్తూనే ఉంటామన్నారు. దళిత ఐక్య కార్యచరణ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికం..

■ కనులపండువగా రథోత్సవం



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం కౌలాస్ గ్రామంలో రథసప్తమి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవం, అగ్నిగుండం కార్యక్రమం కనులపండువగా నిర్వహించారు. బసవలింగ శివాచార్య మఠాదీశుల ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరుపుతున్నారు. రథోత్సవ కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే, మాజీ ఎమ్మెల్యేలు గంగారాం, అరుణతార, సర్పంచ్ హన్మండ్లు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

■ ఘనంగా చండీహోమం



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణంలో రుద్రయాగ సహిత చండీహోమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. భగళాముఖీ పీఠం జ్యోతిష్య పండితులు క్రాంతికుమార్ నిర్వహణలో రుత్వికులు హోమాన్ని నిర్వహించారు. టీపీసీసీ కార్యదర్శి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి, పీఠం సభ్యులు విఠల్, సతీష్, రేవంతప్ప పాల్గొన్నారు.

మద్నూర్ మండలకేంద్రంలో..

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని గురుమఠంలో ఆదివారం చండీ హోమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పదకొండు మంది వేద పండితుల ఆధ్వర్యంలో గురు చంద్రశేఖర్ మహారాజ్ హోమంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.మాజీ ఎమ్మెల్యేలు గంగారాం, అరుణతార, పలు పార్టీల నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

■ సోమాయప్ప స్వామీజీ భిక్షాటన

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని పెద్ద దేవాడలో బండాయప్ప మఠం పీఠాధిపతి శ్రీ సోమాయప్ప స్వామీజీ ఆదివారం భిక్షాటన చేపట్టారు. ప్రతి ఏటా మహాశివరాత్రి మహోత్సవ కార్యక్రమాల సందర్భంగా మఠంలో భక్తులకు అన్నదానం, మూడు రోజులు మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈసందర్భంగా స్వామీజీకి భక్తులు ధాన్యం, డబ్బులు సమర్పించారు.

■ సాధు పరిషత్తు మహాసభల్లో కృష్ణానందస్వామి

కామారెడి అర్బన్: నందిపేట పలుగుట్ట కేదారేశ్వర ఆశ్రమంలో నిర్వహిస్తున్న 57వ అఖిలాంధ్ర సాధు పరిషత్ మహాసభల్లో కామారెడ్డికి చెందిన శ్రీరామ కోటి జపలిఖిత ప్రచారకుడు కృష్ణానందస్వామి పాల్గొన్నారు. ఆదివారం ఆయన సంఖ్యాయోగం రెండవ అధ్యాయంపై ప్రసంగించారు. మోక్షం పొందడానికి గురు అనుగ్రహం వల్ల శాశ్వత శాంతి పొందుతారని కృష్ణానందస్వామి అన్నారు.

■ కొనసాగుతున్న మహా పాదయాత్ర



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని లింగంపల్లి శ్రీ కృష్ణ మందిరం నుంచి ఈ నెల 23న ప్రారంభించిన మహాపాదయాత్ర ఆదివారం శ్రీ క్షేత్రం రాహేర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా పీఠాధిపతులు మచాలే బాబా, కన్హైరాజ్ బాబాలు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరిలో భక్తిని నింపాలనే ఉద్దేశ్యంతో ఈ పాదయాత్ర చేపట్టినట్లు వారు పేర్కొన్నారు.

■ సాయి ఆలయంలో ప్రత్యేక పూజలు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో శనివారం రథసప్తమి సందర్భంగా రాత్రి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సుధాకర్‌శర్మ పంతులు ఆధ్వర్యంలో అభిషేకం, హారతులు, ఇచ్చి పూజలు ఘనంగా నిర్వహించారు. అనంతరం సాయిబాబా చిత్రపటం, పాదుకలు పల్లకీలో ఏర్పాటు చేసి ఊరేగించారు. భక్తి పాటలు ఆలపిస్తూ నగర సంకీర్తన చేశారు.

మైసమ్మ ఆలయంలో..



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని మైలారం గ్రామంలో గల కొచ్చరి మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారికి పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు.

సంక్షిప్తం..

బీపీఎంకు సన్మానం

పిట్లం(జుక్కల్): మండలంలోని హస్నపూర్‌లో ఆదివారం బీపీఎం సతీష్‌ను గ్రామస్తులు శాలువ పూలమాలతో సన్మానించారు. గ్రామంలో గత 10 సంవత్సరాలుగా విధులు నిర్వహించి, ఇటీవల బదిలీ కావడంతో ఆయనను సన్మానించినట్లు గ్రామస్తులు తెలిపారు. సర్పంచ్ గోపాల్ రెడ్డి, జీపీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీకి తరలిన టీజేఎస్ నాయకులు

కామారెడ్డి టౌన్: టీజేఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలో ఢిల్లీ మౌన దీక్ష కార్యక్రమానికి జిల్లా నుంచి టీజేఎస్ నాయకులు ఆదివారం బయలుదేరారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి నిజ్జన రమేష్, జిల్లా కన్వీనర్ లక్ష్మణ్ యాదవ్, రాణి, గోపాల్, సాయిలు, సురేష్, ముదిరాజ్ ఉన్నారు.

క్రీడాకారులకు క్రికెట్ కిట్ల పంపిణీ

రాజంపేట: మండలంలోని పొందుర్తి గ్రామంలో క్రీడాకారులకు షబ్బీర్ అలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ కిట్లను అందజేశారు. మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంకం కృష్ణరావు, గడుగుల బాబు, ప్రభాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీకాంత్

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నామ శ్రీకాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బార్ అసోసియేషన్ కార్యవర్గం నాయకులు పేర్కొన్నారు. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పిట్లం(జుక్కల్): పిట్లం మండల మాజీ వైస్ ఎంపీపీ నర్సగౌడ్ సోదరుడు దిగంబర్ గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే హన్మంత్ షిందే ఆదివారం పరామర్శించారు. జెడ్పీటీసీ అరికెల శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు విజయ్, రమేష్ పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట మండలంలో..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మాల్తుమ్మెద మాజీ సర్పంచ్, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఈటెల నారాయణ సోదరుడు నర్సింలు ఇటీవల హఠాన్మరణం చెందాడు. బాధిత కుటుంబాన్ని ఆదివారం ఎల్లారెడ్డి ఏఎంసీ చైర్మన్ కాశీ నారాయణ పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకులు దుర్గారెడ్డి, సంగయ్య, మల్లేశం తదితరులున్నారు.

డబ్బుల కోసమే గేదె మృతి నాటకం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మాలోత్ తండాకు చెందిన ధారావత్ రాములుకు చెందిన గేదె మృతి చెందలేదని శెట్పల్లిసంగారెడ్డి సెక్షన్ ట్రాన్స్‌కో ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందినట్లు ఆదివారం వచ్చిన వార్త ఆధారంగా గ్రామానికి వెళ్లి విచారించగా తండాలో ఎలాంటి గేదె మృతి చెందలేదని తేలినట్లు తెలిపారు. తండాకు చెందిన రాములు డబ్బుల కోసం పాత ఫోటో పెట్టి తప్పుగా వార్త రాయించినట్లు తెలిపారు.